క్లుప్తంగా

రామాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట



ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న హిమగౌరి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లోని శ్రీ సీతారామ లక్ష్మణ స్వాముల ఆలయం వద్ద ధ్వజ స్తంభం ప్రతిష్టాపన, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సెలర్ ఈటి శ్యామలరావు, గ్రామపెద్ద వెంకట పతిరాజు, అచ్యుత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలో 33/11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా సంబంధిత ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. వీఎస్ఈజెడ్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, వీఎస్ఈజెడ్ క్యాంపస్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని సూచించారు.

ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం



చెత్తకు నిప్పు అంటుకోవడంతో వెలువడుతున్న దట్టమైన పొగ

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ డీ బ్లాక్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గాజువాక కుంచమాంబ కాలనీ వద్ద వినాయక ఆలయం ఎదురుగా ఆటోనగర్ డీ–బ్లాక్‌లో దట్టమైన తుప్పలతో కూడిన ప్రదేశంలో భారీగా చెత్త ఉంది. ఆ ప్రాంతంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గానీ, చెత్త ఏరుకునేవారు గానీ సిగరెట్ వెలిగించడం వల్లనో లేదా చెత్తకు నిప్పు పెట్టడం వల్ల గానీ.. లేదంటే ఎండ వేడి వల్ల చెత్త తగలబడిందని భావిస్తున్నారు. భారీగా మంటలు ఎగిసిపడి దట్టమైన పొగ వ్యాపించడంతో పరిసర ప్రాంతాల వారు ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న ఆటోనగర్ అగ్నిమాపక కేంద్రం ఏడీఎఫ్ఓ ఎస్.గోపీకృష్ణ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. ఎలాంటి ఆస్తినష్టం వాటిల్లలేదని తెలిపారు.

నేరాలపై అప్రమత్తత అవసరం



అపార్ట్‌మెంట్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: అపార్ట్‌మెంట్ వాసులు నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు సూచించారు. గాజువాకలోని నోవాస్ అపార్ట్‌మెంట్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చన్నారు. వేసవి దృష్ట్యా నేరాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఊళ్లకు వెళ్లినప్పుడు తమ వివరాలను స్టేషన్‌లో తెలపాలన్నారు. బయటికి వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్లను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ మధ్యకాలంలో జరిగిన ఇతర నేరాల గురించి వివరించారు. అపార్ట్‌మెంట్ వాసుల అనుమానాలను పోలీసులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో గాజువాక క్రైం ఎస్ఐ ఎ.మన్మధరావు, హెచ్‌సీ వరహాలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా వైఎస్సార్‌సీపీ



సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



ఆర్యవైశ్య సంఘం నాయకులతో అమర్‌నాథ్ తదితరులు

- వారి సమస్యల పరిష్కారానికి కృషి
- ఆ పార్టీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

గాజువాక : నియోజకవర్గంలో ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాత గాజువాకలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామన్నారు. గాజువాకలో వ్యాపారాలు, తమ కార్యకలాపాలను ఆర్యవైశ్యులు సజావుగా సాగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇస్తారన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి సీఎం కృషి చేశారన్నారు. గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనతో పాటు ఎంపీగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని కూడా గెలిపించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కులుకూరి మంగరాజు, నంబూరి జగన్నాథరావు, కేసారపు శ్రీను రమేష్, సతీష్, నగేష్‌బాబు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు శనివారం నాటికి 1157వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న లక్ష్యానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీరం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని ఆరోపించారు. సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఉక్కు నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమ సెగ దేశ వ్యాప్తంగా వెళ్లిందని, ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మరో ముగ్గురు వలంటీర్ల రాజీనామా

గాజువాక : గాజువాకలో మరో ముగ్గురు వార్డు వలంటీర్లు రాజీనామా చేశారు. తమను చంద్రబాబు సహా పలువురు నాయకులు ప్రజా సేవల నుంచి దూరం చేయడంతో మనస్తాపం చెందిన వలంటీర్లు తమ విధులకు రాజీనామాలు చేస్తున్న విషయం తెలిసిందే. అదే బాటలో గాజువాక వుడా కాలనీ–04 సచివాలయానికి చెందిన ఎస్.కె.నదియా, ఎం.సంధ్య, ఎస్.కె.నూర్జహాన్ తమ రాజీనామాలను సచివాలయ అడ్మిన్ సెక్రటరీకి అందజేశారు.

సాంస్కృతిక పోటీలకు ఆహ్వానం

సీతంపేట: మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ సారథ్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో పోటీల పోస్టర్‌ను ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ నెల 29న అంతర్జాతీయ నృత్యప్రదర్శన దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రీయ, జానపద నృత్యం, సినీ గీతాలాపన, సంగీత పరికరాల వాద్యం, డ్రాయింగ్, పెయింటింగ్, చిన్నపిల్లలకు విచిత్ర వేషధారణ, పెద్దలకు వస్త్రాలంకరణ వంటి పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు మహమ్మద్ షకీల్ తెలిపారు. పాల్గొన దలచిన వారు ఈ నెల 25లోగా వాట్సాప్ నంబర్ 99664 85335లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు ప్రసంశాపత్రాలు అందజేస్తామన్నారు.

మహిళపై దాడి

గాజువాక : ఒక ఖాళీ స్థలం విషయంలో చోటుచేసుకున్న వివాదం నేపథ్యంలో ఒక వ్యక్తి మహిళపై దాడి చేశాడు. ఖాళీ స్థలంలో తుప్పలకు పెట్టిన మంటల్లోకి నెట్టివేయడంతో ఆమె గాయాలపాలైంది. గురువారం చోటుచేసుకున్న ఈ సంఘటన శనివారం వెలుగు చూసింది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 65వ వార్డుకు చెందిన జె.రాధ ఆ వార్డులో గల ఒక ఖాళీ స్థలానికి పట్టా ఇప్పించాలంటూ లోకనాథం అనే వ్యక్తిని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆశ్రయించారు. పట్టా ఇప్పించడం కోసం అతడు డబ్బు డిమాండ్ చేశాడు. దానికి ఆమె నిరాకరించడంతో వారిద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ స్థలంలోకి కూడా ఆమెను వెళ్లనివ్వకుండా లోకనాథం అడ్డుకుంటున్నాడంటూ ఫిబ్రవరి 20న న్యూపోర్టు పోలీసులకు, 26న నగర పోలీస్ కమిషనర్‌కు రాధ ఫిర్యాదు చేశారు. ఈ గొడవ కొనసాగుతుండగా, ఈ నెల 11న కూడా వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ స్థలంలో తుప్పలను తొలగించి మంట పెట్టగా, మంటలు ఆరుతున్న సమయంలో అక్కడికి వచ్చిన లోకనాథం తనను ఆ మంటల్లోకి తోసి హత్య చేయబోయారంటూ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు న్యూపోర్టు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్టు సీఐ దాలిబాబు తెలియజేశారు.

పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యం

- పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించిన వారికి సముచిత స్థానం
- మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్



కార్యక్రమానికి హాజరైన బూత్ కమిటీ, వైఎస్సార్ సీపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యం కల్పిస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. వారికి సముచిత స్థానం తప్పక లభిస్తుందన్నారు. 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు నివాసంలో శనివారం రాత్రి నిర్వహించిన బూత్ కమిటీల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముందు నుంచి పని చేసిన వారికి రాజకీయ భవిష్యత్తు కల్పిస్తామన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నందున ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేస్తే తప్పకుండా విజయం సాధించగలమన్నారు.

కార్యక్రమంలో గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, గాజువాక మండల అధ్యక్షుడు గౌస్, వార్డు మహిళా అధ్యక్షురాలు కమరున్నిసా బేగం, ఈగలపాటి యువశ్రీ, నాయకులు బోగాది అప్పారావు, కాకి అప్పల రెడ్డి, అంగ బాబూరావు, ఈశ్వరరావు, వీర్రాజు, యర్రాజీ, విరోతి రాము, సాలాపు వెంకట్రావు, కృష్ణంరాజు, మురళీకృష్ణ, ప్రమీల, దుర్గారెడ్డి, వినోద్‌రెడ్డి, రామిరెడ్డి, ప్రకాష్ రెడ్డి, పిలకా రమణామూర్తి తదితరులు పాల్గొన్నారు.



నాతయ్యపాలెంలో బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

21 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా అనంతరం మంత్రి అమర్‌నాథ్‌తో వలంటీర్లు

జీవీఎంసీ 69వ వార్డులో 21 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను శనివారం ఆయా సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలకు సమర్పించారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని చంద్రబాబు అడ్డుపడటంతో మనస్తాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వారంతా రాష్ట్ర మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి, తమ రాజీనామా అంశాన్ని తెలియజేశారు. రాజీనామా చేసిన వలంటీర్లకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తప్పకుండా న్యాయం చేస్తారని అమర్‌నాథ్ తెలిపారు.

16న ఈడీ కార్యాలయం ముట్టడి



స్టీల్‌ప్లాంట్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 16న నిర్వహించనున్న ఈడీ (వర్క్స్) కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఎల్ఎంఎం పార్కులో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ప్రగతి కోసం పనిచేస్తున్న కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు వేతన సవరణ చేయకపోగా ప్రతీ నెల సకాలంలో జీతాలు కూడా సక్రమంగా చెల్లించటం లేదన్నారు. ప్రస్తుత గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు రోజుకో సదుపాయం కోల్పోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, బి.గోపాలరాజు, ప్రభాకరరెడ్డి, కొమ్ము ప్రసాద్, ఎస్.ఎ.నాయుడు, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహోదాత్త మహిళ సీతాదేవి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. శనివారం పీఠం దర్బారు హాల్‌లో విశాఖ సాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని రామాయణంలోని సీతాదేవి పాత్రపై ప్రవచనం చేశారు. సీతాదేవి మహోదాత్త మహిళని, రావణ సంహారం కోసమే ఆమె జననం జరిగిందని, సీతారాముల దాంపత్యం లోకానికి ఆదర్శప్రాయమన్నారు. వాల్మీకి చిత్రించిన సీతాదేవి పాత్రలోని భిన్న కోణాలను ఆవిష్కరించారు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంలోని పద్యాలను ఉదహరిస్తూ ప్రసంగం ఆకట్టుకునేలా సాగింది.

విశాఖ పోర్టుతో సమానంగా జీతాలివ్వాలి

గంగవరం పోర్టు కార్మికుల డిమాండ్



గంగవరం పోర్టు గేటు వద్ద బైఠాయించిన కార్మికులు

గాజువాక : విశాఖ పోర్టుతో సమానంగా తమకు కూడా జీతాలను సవరించాలని అదాని గంగవరం పోర్టు కార్మికులు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ అంశంపై గత నాలుగు రోజులుగా ఆందోళనకు దిగిన కార్మికులు తమ ఆందోళనను శనివారం మరింత ఉధృతం చేశారు. కనీస వేతనంగా రూ.36 వేలు చెల్లించాలని, పోర్టులో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, మరణించిన కార్మిక కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తూ ఆర్ అండ్ ఆర్‌లో ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోర్టు లోపల, బయట ఆందోళనకు దిగారు. కార్మికుల ఆందోళనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల నిరసనతో పోర్టు వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

మహిళా సంక్షేమ ప్రభుత్వమిది..

- మగువల పేరు మీదే అన్ని పథకాలు
- అతివలకు అన్ని రంగాల్లో అగ్రస్థానం
- వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే వీటి కొనసాగింపు
- ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తల్లి నాగమణి



68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని మహిళల సమావేశంలో మాట్లాడుతున్న గుడివాడ నాగమణి

అక్కిరెడ్డిపాలెం: మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్న సంక్షేమ ప్రభుత్వమిది అని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని, అన్ని సంక్షేమ పథకాలు వారి పేరు మీదే అందజేయడమే దీనికి నిదర్శనమని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో డ్వాక్రా సంఘాలు, స్థానిక మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గాజువాక ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అమర్‌నాథ్‌ను ఆశీర్వదించాలని కోరారు. తమ కుటుంబం ప్రజా సేవకే అంకితమైందన్నారు. అక్కిరెడ్డిపాలెం గ్రామ ప్రజలు గుడివాడ కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్నారన్నారు. మీ బిడ్డ అమర్‌నాథ్‌ను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పారదర్శకంగా పథకాల అమలు

కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ నాయకుడు లతీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. పథకాలన్నీ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే వేస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలన కొనసాగేలా గుడివాడ అమర్‌నాథ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అలాగే, బొత్స ఝాన్సీలక్ష్మికి ఎంపీగా విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వరదాడ వెంకటరమణ, ఈటి శ్యామలరావు, నేలపాటి సత్యవతి, బోనెల జోసెఫ్, తెంటు గోపాలరావు, సయ్యద్ హుస్సేన్, నేలపాటి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుడివాడ నాగమణి 67వ వార్డు జోగివానిపాలెంలోనూ ప్రచారం నిర్వహించారు.



సమావేశానికి హాజరైన మహిళలు

70, 71 వార్డుల్లో అమర్ సతీమణి ప్రచారం



70వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న హిమగౌరి

గాజువాక : వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన భార్య గుడివాడ హిమగౌరి శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 70, 71 వార్డుల కార్పొరేటర్లు ఉరుకూటి చందు, రాజాన రామారావు నేతృత్వంలో ఆయా వార్డులలోని మహిళలతో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాజువాక అభివృద్ధి కోసం తన భర్త అమర్‌నాథ్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి జగన్నాథం, మురళి, యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డులో వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం



76వ వార్డు ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక : వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ 76వ వార్డు నాయకులు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి దొడ్డి రమణ ఆధ్వర్యంలో గోపాలరెడ్డినగర్, బాలచెరువు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిలను గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రంబ నారాయణ మూర్తి, మంత్రి శంకరనారాయణ, ఒ.కొండయ్య, తాటికొండ జగదీష్, కల్లూరు సత్యప్రసాద్, ఎస్. శ్రీనివాసరావు, డి.చిన్నారావు, గంగరాజు, సుదర్శన్, కృష్ణ, కవి, పద్మ, దువ్వి రాణి, కె.హారిక, లక్ష్మీపతి, వంగల అప్పలరాజు, కొయ్య జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మత పెద్దకు 'దామా' ట్రస్ట్ చేయూత



రియాఉద్దీన్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న దామా సుబ్బారావు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన ముస్లిం మత పెద్ద మహ్మద్ రియాఉద్దీన్‌కు ఆ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆర్థిక సాయం అందజేశారు. గృహ నిర్మాణంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో దామా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 50 వేల రూపాయలను ముస్లిం మత పెద్దల సమక్షంలో అందించారు. వార్డులో ఎవరికి ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉండి ఆదుకుంటానని దామా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాడపల్లి రామచంద్రరాజు, వార్డు అధ్యక్షులు మెడికల్ బాబు, చేగొండి శ్రీనివాస్, ప్రసాద్, బాల, ఇతర ముస్లిం మత పెద్దలు మస్తాన్, మున్నా, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు స్టీల్‌ప్లాంట్ అధికారులు, కార్మికులు శనివారం ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని, స్టీల్‌ప్లాంట్ సీఆర్ఎంపీ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో విభాగం జనరల్ మేనేజర్ కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని తీర్చిదిద్దారన్నారు. అంబేడ్కర్ దూరదృష్టితో రాసిన రాజ్యాంగం దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నివాళి అని పేర్కొన్నారు. విభాగం అధికారులు వై.బాలకోటయ్య, రాజేష్, నాయక్, ఆర్ఈడీ విభాగం అధికారులు సంతోష్, కిన్నెర మేఘన, కార్మిక సంఘాల ప్రతినిధులు ఎస్.రమేష్ కుమార్, కె.పుష్యరాజు, పి.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.